ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు - 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు - 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు - 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె - 9985411377



ఉల్లి ధరలో మాయాజాలం

- గరిష్ఠం దక్కేది కొందరికే..
- వ్యాపారుల కనుసన్నల్లో ధరల నిర్ణయం
- యార్డుల కంటే గ్రామాల్లోనే ఎక్కువ ధర
- భారీగా జీరో.. సెస్సుకు గండి
- చోద్యం చూస్తున్న అధికారులు
- టెండరు విధానంలోనూ రైతులకు అన్యాయమే..



కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 28:



ఈ రైతు పేరు నారాయణ. వర్కూరు గ్రామంలో తనకున్న నాలుగెకరాల పొలంలో ఉల్లి పంటను సాగు చేశాడు. దాదాపు ఎకరాకు రూ.60 వేల దాకా ఖర్చు చేశాడు. పంట దిగుబడిని కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకు వస్తే.. వ్యాపారులు క్వింటానికి రూ.2,500 చెల్లిస్తామని గిరి గీయడంతో ఇదేమి అన్యాయమంటూ ఉల్లిని మళ్లీ ట్రాక్టరులో తీసుకుని గ్రామానికి వెళ్లిపోయాడు. అక్కడ వ్యాపారులు క్వింటానికి రూ.3 వేలు చెల్లించినట్లు రైతు నారాయణ తెలిపారు. మార్కెట్ యార్డు కంటే గ్రామాల్లో వ్యాపారులే నయమని రైతులు అంటున్నారు. ఉల్లి ధరలో ఇదేమి మాయాజాలం అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్రంలో ఎక్కువ విస్తీర్ణంలో ఉల్లిని సాగు చేస్తున్న ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రైతులకు చివరకు కడగండ్లే మిగులుతున్నాయి. ఈ సంవత్సరం ప్రస్తుత ఖరీఫ్‌లో దాదాపు 50వేల ఎకరాల్లో ఉల్లి పంటను రైతులు సాగు చేశారు. 50వేల ఎకరాల్లో దిగుబడిని లెక్కేస్తే.. 25 లక్షల క్వింటాళ్ల ఉల్లి దిగుబడి రావచ్చని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే సెప్టెంబరు 1వ తేదీ నుంచి మంగళవారం 24వ తేదీ వరకు కర్నూలు మార్కెట్ యార్డుకు దాదాపు 90వేల క్వింటాళ్ల ఉల్లిని రైతులు అమ్ముకున్నారు. అదే విధంగా గ్రామాల్లో వ్యాపారులు దాదాపు 2 లక్షల క్వింటాళ్ల ఉల్లిని రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఈ 2 లక్షల క్వింటాళ్లకు సంబంధించి మార్కెట్ కమిటికి వ్యాపారులు చెల్లించాల్సిన సెస్సుకు గండి కొట్టినట్లయింది. మరో వైపు కర్నూలు జిల్లాలోని ఉల్లి కొనుగోలు కేవలం ఒక్క కర్నూలు మార్కెట్ యార్డులోనే కొనసాగుతున్నది. రైతులు ఈ మార్కెట్ యార్డులో తమకు గిట్టుబాటు ధర లభిస్తుందనే ఆశతో మారుమూల గ్రామాల నుంచి కర్నూలు యార్డుకు ఉల్లిని అమ్ముకునేందుకు తరలివస్తున్నారు. అయితే.. అధికారుల నిర్లక్ష్యం, వ్యాపారుల సిండికేట్‌తో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. కేవలం కొంత మంది రైతులకు మాత్రమే గరిష్ఠ ధర దక్కుతుండగా.. నాణ్యత లేదనే సాకుతో కమిషన్ ఏజెంట్లు మధ్యస్థ, కనిష్ఠ ధరలు మాత్రమే అధిక మొత్తం ఉల్లికి ధరను నిర్ణయిస్తుండటంతో రైతులు రైతులు కన్నీళ్లు పెట్టుకోవడం తప్ప.. వారికి మరో దారి కనిపించడం లేదు. గ్రామాల్లోకి రైతులు వచ్చి అధిక ధరను చెల్లిస్తామని వ్యాపారులు బతిమిలాడినా కర్నూలు మార్కెట్ యార్డులో ఎక్కువ ధర లభిస్తుందనే ఆశతో వస్తే కమిషన్ ఏజెంట్లు మాత్రం తక్కువ ధరను చూపి రైతులను నట్టేట ముంచుతున్నారు. కొంత మంది రైతులు మరోదారి లేక కమిషన్ ఏజెంట్లకు అమ్ముకుంటే చాలా మంది రైతులు గ్రామాలకే ఉల్లిని తీసుకెళ్లి అక్కడ అమ్ముకుంటున్నారు. టెండరు విధానంలో రైతులకు ఎక్కువ ధర లభిస్తుందని, లైసెన్సు తీసుకున్న వ్యాపారులంతా పోటీ పడి ఉల్లిని కొనుగోలు చేస్తారని అధికారులు చెబుతున్న మాటలు నీటిమూటలయ్యాయి.



ధర గిట్టుబాటు గాక వెనుదిరుగుతున్న రైతులు

కర్నూలు మార్కెట్ యార్డులో ధర తమకు ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదని, తిరిగి తమ గ్రామాలకే అధిక రవాణా ఖర్చులు భరించి తీసుకెళ్తున్నారు. గ్రామాల్లోనే వ్యాపారుల నుంచి క్వింటానికి రూ.3వేలకు పైగా ధర లభిస్తుంటే.. మార్కెట్ యార్డులో కేవలం రూ.2వేలు మాత్రమే ఇస్తున్నారని, అందువల్ల మార్కెట్ యార్డులో నుంచి రవాణా ఖర్చులు భరించి మళ్లీ గ్రామాలకే తీసుకెళ్లి ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నామని రైతులు చెబుతున్నారు. మార్కెట్ యార్డులో ఎక్కువ ధర రావాల్సిందిపోయి.. దానికి విరుద్ధంగా గ్రామాల్లో వ్యాపారుల కంటే తక్కువ ధరకు తీసుకుంటున్నారని, ఇదేమి అన్యాయమని వారు ప్రశ్నిస్తున్నారు.

టెండరు విధానం అమలులోకి వచ్చినా ప్రయోజనం శూన్యమే

గతంలో కర్నూలు మార్కెట్ యార్డులో వ్యాపారులే రైతుల వద్దకు వెళ్లి నాణ్యతను పరిశీలించి ధరను నిర్ణయించే వారు. దీనివల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని నిర్ణయించి మిగిలిన పంట ఉత్పత్తుల మాదిరిగా కొనుగోళ్లను టెండరు విధానంలో అమలు చేయాలని నిర్ణయించారు. అప్పట్లో వ్యాపారులు తమకు టెండరు విధానం ఏ మాత్రం సమ్మతి కాదని, పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఒకదశలో కొనుగోళ్లను కూడా నిలిపివేశారు. అయితే.. అప్పట్లో మార్కెట్ కమిటీ అధికారులు వ్యాపారుల చేత బలవంతంగా టెండరు విధానాన్ని అమలు చేశారు. రైతులు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించి మద్దతు పలికారు. అయితే.. పాత సీసాలో కొత్తసారా అన్న చందంగా రైతుల పరిస్థితి మారింది. గతంలో మాదిరిగానే తక్కువ ధర లభించడంతో రైతులు కన్నీళ్లతో బాధపడటం తప్ప.. మరోదారి కనిపించడం లేదు. వాస్తవంగా కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి కొనుగోలుకు సంబంధించి 30 మంది వ్యాపారులకు లైసెన్సులు ఇచ్చారు. అయితే.. ప్రస్తుతం కేవలం ఐదుగురు వ్యాపారులు మాత్రమే ఉల్లి టెండరులో పాల్గొంటున్నారు. ఈ ఐదుగురు రైతులు తమకు అనుకూలమైన ధరను మాత్రమే నిర్ణయిస్తున్నారు. వీరు కొనుగోలు చేసిన ఉల్లిని మిగిలిన వ్యాపారులు కొనుగోలు చేస్తూ ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తుండటం గమనార్హం. లైసెన్సు తీసుకున్న వ్యాపారులు ఎందుకు టెండరులో పాల్గొనడం లేదో అధికారులు సరైన జవాబు ఇవ్వలేక పోతున్నారు. వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో కూడా అధికారులు చెప్పలేకపోతున్నారు. వ్యాపారులందరి టెండరులో పాల్గొనేలా చేస్తే పోటీ ఎక్కువై ధర తమకు సక్రమంగా అంది న్యాయం జరుగతుందని రైతులు చెబుతున్నారు.

భారీగా సెస్సుకు గండి

ఈ సంవత్సరం ఖరీఫ్‌లో దాదాపు 50వేల ఎకరాల్లో ఉల్లిని రైతులు సాగు చేశారు. ఎకరాకు 50 క్వింటాళ్ల దిగుబడిని లెక్కించినా దాదాపు 25 లక్షల క్వింటాళ్ల దిగుబడి రైతులకు అందుతుందని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ఈ మొత్తంపై సెస్సు పెద్ద ఎత్తున రావాల్సి ఉండగా.. వ్యాపారుల సిండికేట్‌తో తక్కువ ధర లభిస్తుందనే భయంతో రైతులు గ్రామాల్లోనే దళారులు, వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. మార్కెట్ యార్డుపై రైతుల భయాన్ని ఆసరగా తీసుకుని ఉమ్మడి కర్నూలు జిల్లాలోని దాదాపు వంద మంది దళారులు, వ్యాపారులు గ్రామాల్లోకి లారీలను తీసుకెళ్లి రైతుల నుంచి తక్కువ తూకాలు వేసి కొనుగోలు చేస్తున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ఉల్లిని వ్యాపారులు హైదరాబాదు, తమిళనాడు, ఢిల్లీ, బంగ్లాదేశ్ తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి రెట్టింపు ధరలకు అమ్ముకుని రూ.లక్షల్లో ఆదాయాన్ని పొందుతున్నారు. వ్యాపారులు కొనుగోలు చేసిన ఉల్లి వల్ల మార్కెట్ కమిటీకి రూ.లక్షల్లో ఆదాయం సెస్సు రూపంలో రావాల్సి వున్నా గ్రామాల్లోనే వ్యాపారులు కొనుగోలు చేసిన ఉల్లిని రాత్రిపూట తరలించి సెస్సుకు ఎగనామం పెడుతున్నారు. దీనివల్ల రూ.లక్షల్లో సెస్సు ఆదాయాన్ని మార్కెట్ కమిటీ పొందలేకపోతుంది. వ్యాపారుల సిండికేట్‌ను నిరోధించి కర్నూలు మార్కెట్ యార్డుపై రైతుల్లో నమ్మకాన్ని పొందేలా అధికారులు కఠినమైన చర్యలు తీసుకోలేకపోవడం దారుణం.

సిండికేట్ వ్యాపారాన్ని అరికట్టండి



కర్నూలు మార్కెట్ యార్డుల పెద్ద ఎత్తున ఉల్లి రైతులకు నష్టం జరుగుతోంది. ప్రభుత్వం నిర్ణయించిన క్వింటానికి రూ.700 కూడా చాలా మంది రైతులకు దక్కడం లేదు. టెండరు విధానాన్ని అమలులోకి తెచ్చామని రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుందని గొప్పలు చెప్పుకుంటున్న అధికారుల మాటలు నీటి మూటలవుతున్నాయి. 30 మంది వ్యాపారులు ఉంటే.. కేవలం ఐదుగురు మాత్రమే టెండరులో పాల్గొంటున్నారు. మార్కెట్‌యార్డులో ధర గిట్టుబాటు గాక రైతులు తమ గ్రామాలకు తీసుకెళ్లి ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారంటే కర్నూలు మార్కెట్ యార్డు వల్ల రైతులకు ప్రయోజనం ఉందా? అధికారులు ఆలోచించాలి **- రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి**

గిట్టుబాటు ధర అందిస్తున్నాం



రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అధిక వర్షాల వల్ల ఉల్లి నాణ్యత పడిపోతోంది. నాణ్యత లేని కారణంగా వ్యాపారులు అధిక ధరను వ్యాపారులు రైతులకు అందించలేకపోతున్నారు. కనిష్ఠ ధర రూ.200-300 మాత్రమే ఉందని, అయితే.. పూర్తిగా డ్యామేజీ కావడంతోనే ఆ ఉల్లికి ధర ఎక్కువ రావడం లేదు. ప్రస్తుతం నాణ్యమైన ఉల్లికి కర్నూలు మార్కెట్ యార్డులో మంచి ధర లభిస్తోంది. గరిష్ఠ ధర నాణ్యమైన ఉల్లికి క్వింటానికి రూ.4వేలకు పైగానే వస్తుంది. ఉల్లి టెండరులో వ్యాపారులంతా పాల్గొనేలా చర్యలు తీసుకుంటాం. మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న చెక్‌పోస్టుల ద్వారా వ్యాపారులు పక్క రాష్ట్రాలకు తరలిస్తున్న ఉల్లి నుంచి సెస్సును వసూలు చేస్తున్నాం. ఎక్కడా సెస్సు ఆదాయానికి గండి పడడం లేదు.
- జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ, కర్నూలు మార్కెట్ యార్డు

మార్కెట్ యార్డులో మాయాజాలం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 50వేల ఎకరాల్లో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగైంది. ఇంత పెద్ద మొత్తంలో ఉల్లి పంట రాష్ట్రంలో ఎక్కడా సాగు కాకపోవడం గమనార్హం. మహారాష్ట్ర తర్వాత ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే పెద్ద ఎత్తున రైతులు ఉల్లిని సాగు చేస్తున్నారు. అయితే.. అధికారుల నిర్లక్ష్యం, కమిషన్ ఏజెంట్ల సిండికేట్‌తో ఉల్లి రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారు. గత రెండేళ్లుగా భారీ వర్షాలు, తుఫాన్‌లతో ఉల్లి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరాకు రూ.60వేల దాకా ఉల్లి పంట సాగు కోసం రైతులు ఖర్చు చేస్తే కేవలం ఎకరాకు 20 క్వింటాళ్ల కంటే తక్కువే దిగుబడి పొందారు. కనీసం ఈ ధరకైనా అమ్ముకుందామని రైతులు ఎంతో ఆశతో ఉన్నా కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు తమ జేబులు నింపుకోవడానికే అక్రమాలకు పాల్పడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ సంవత్సరం రైతులు సెప్టెంబరు 1వ తేదీ నుంచి కర్నూలు మార్కెట్ యార్డుకు ఉల్లిని అమ్మకానికి తీసుకురావడం మొదలైంది. అయితే.. యార్డులో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతుండటంతో కొంత మంది రైతులు మరోదారి లేక ఈ యార్డులోనే అమ్ముకుంటుండగా.. మరికొంత మంది రైతులు గ్రామాలకు తీసుకెళ్లి అక్కడ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. సెప్టెంబరు నెలలో 24వ తేదీ వరకు దాదాపు 90వేల మెట్రిక్ టన్నుల ఉల్లిని రైతులు అమ్మకానికి తెచ్చారు. ఈ మొత్తం ఉల్లిలో కొంత ఉల్లిని కేవలం క్వింటానికి రూ.297లకు మాత్రమే కొనుగోలు చేశారు. మధ్యస్థ రకం ఉల్లికి రూ.1,500 నుంచి రూ.3,639, గరిష్ఠంగా క్వింటానికి రూ.4,129లు రైతులకు దక్కింది. కనిష్ఠ, మధ్యస్థ ధరలకు అమ్ముకున్న రైతులు తాము నష్టపోయామంటూ కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

ట్రాన్స్‌జెండర్లకు 44వ నెంబరులో ప్రత్యేక ఓపీ

కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్



కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 28: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక ఓపీ 44వ నెంబరులో ఏర్పాటు చేశామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ట్రాన్స్ జెండర్‌కు ఓపీలో కావాల్సిన స్పెషాలిటీ సేవలు అందిస్తారని ప్లాస్టిక్ సర్జరీ, యురాలజీ, ఎండోక్రైనాలజీ వైద్యులతో వన్‌స్టాప్ సెంటర్ నుంచి తీసుకుని సేవలు అందిస్తారన్నారు. ఇటీవల కాలంలో ట్రాన్స్‌జెండర్లు ఓపీ బాగా పెరిగిందన్నారు. అలాగే ఓపీ నెంబరు 44లో సాధారణ జబ్బులు, కడుపునొప్పి, గ్యాస్ట్రో సమస్యలను కూడా చూస్తారని తెలిపారు. ట్రాన్స్‌జెండర్‌లకు అవసరమైతే సర్టిఫికెట్లు ఇస్తామని అన్నారు. ఓపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు చేయండి

కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 28: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి అక్టోబరు 1న ఉదయం 11.40 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు కర్నూలు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని అన్నారు. అనంతరం పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామంలో నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపనకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. తదుపరి స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేయించి ప్రజా వేదిక కార్యక్రమంలో గ్రామస్థులతో సంభాషిస్తారన్నారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా సీఎం పర్యటనను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసుశాఖ బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో చిరంజీవి, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో రామలక్ష్మి

పత్తికొండ: అక్టోబరు 1న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పత్తికొండ మండల పరిధిలోని పుచ్చకాయలమడ పర్యటన నేపథ్యంలో ఆర్డీవో రామలక్ష్మి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డితో కలసి శనివారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభాస్థలి ప్రాంతం, ముఖ్యమంత్రి ఏఏ ఇళ్లకు పింఛన్ల పంపిణీకి వెళ్తారన్న అంశాలపై మాట్లాడారు. సభాస్థలికి వెళ్లే మార్గంలో నూతనంగా సీసీ రహదారి వేసి ఉండడంతో 1వ తేదీలోగా క్యూరింగ్ పనులు పూర్తి చేసి రహదారిని శుభ్రపరచాలని ఆదేశించారు. వెలుగు అధికారులతో పింఛన్ల పంపిణీ అంశంపై మాట్లాడారు. గ్రామంలోని హైస్కూల్ వద్ద ఇదివరకే ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు.

గంజాయి సాగు చేస్తే సమాచారం ఇవ్వండి

వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 28: కర్నూలు జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని రైతు సేవా కేంద్రం సిబ్బందికి వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి అన్నారు. శనివారం కర్నూలు జిల్లా కేంద్రంలోని వనరుల కేంద్రం ఉద్యాన భవన్‌లో కర్నూలు డివిజన్ రైతు సేవా సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ ఈక్రాప్, ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు సలహా కేంద్ర సిబ్బందికి వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కర్నూలు ఇన్‌చార్జి ఏడీఏ దస్తగిరిరెడ్డి అధ్యక్షత వహించారు. వివిధ పంటల్లో ఆశించిన చీడపీడల వ్యాప్తిని కంప్యూటర్‌లో నమోదు చేయాలని జేడీ ఆదేశించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సుజాతమ్మ మాట్లాడుతూ ప్రధాన పంటలైన పత్తి, కంది, వేరుశనగ తదితర పంటల్లో వివిధ రకాల తెగుళ్లు క్రిమికీటకాలు ఆశిస్తున్నాయని, రైతులకు వాటి నివారణపై సూచనలు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ఏపీఎంఐపీ ఏపీడీ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ డ్రిప్ సౌకర్యాన్ని అందించేందు కోసం 15 వేల హెక్టార్లను చేర్చాలని లక్ష్యాన్ని నిర్దేశించిందని, పశ్చిమ ప్రాంత నియోజకవర్గాల రైతులకు ఇది సువర్ణ అవకాశమని అన్నారు. ఉద్యాన అధికారి మదన్ మాట్లాడుతూ ఉద్యాన పంటల్లో అనేక రకాల చీడపీడలు ఆశించాయని, వెంటనే రైతులను జాగృతం చేసి పంట నష్టం జరగకుండా కాపాడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్సీ ఏవో నాగసరోజమ్మ, శశిధర్ రెడ్డి, గూడూరు ఏవో శ్రీవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి

నిన్ను గెలిపించడమే మేం చేసిన నేరమా..?

- మమ్మల్ని చంపాలనుకున్న వారికి ప్రాధాన్యత ఇస్తావా?
- ఎమ్మెల్యే పార్థసారథిపై విరుచుకుపడిన చిన్నహరివాణం టీడీపీ కార్యకర్తలు
- గ్రామంలోకి రాకుండా అడ్డుకున్న వైనం

ఆదోని రూరల్ సెప్టెంబర్ 28 : 'నీ గెలుపు కోసం రాత్రింబవళ్లు కష్టప డ్డాం. వైసీపీ అభ్యర్థి సాయిప్రసాద్‌రెడ్డి గెలుపు కోసం మమ్మల్ని చంపా లనుకున్న వారికి నీవు ప్రాధాన్యత ఇస్తున్నావు. నీ గెలుపు కోసం కృషి చేయడమే మేము చేసిన నేరమా... మమ్మల్ని ఎందుకు అవమాని స్తున్నావ్... మమ్మల్ని చంపి మా శవాల మీద నడుచుకుంటూ గ్రామంలోకి వెళ్లు' అంటూ చిన్నహరివాణంకు చెందిన తెలుగు తమ్ముళ్లు దుర్గప్ప, వీరేష్, శివశంకర్, సత్యారెడ్డి ఆదోని ఎమ్మెల్యే పార్థసారధిని అడ్డుకున్నారు. శనివారం రాత్రి 6గంటల సమయంలో ఎమ్మెల్యే పార్థసారథి వివిధ శాఖల అధికారులతో కలిసి ఆదోని మండలం చిన్న హరివాణం గ్రామానికి వెళ్లాడు. వైసీపీ నుంచి బీజేపీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు మాత్రమే గ్రామానికి వస్తున్నట్లు సమాచారం ఇవ్వడంతో టీడీపీ నాయకులు ఎమ్మెల్యేపై మండిపడ్డారు. ఎమ్మెల్యే పార్థసారథిని తెలుగు తమ్ముళ్లు అడ్డుకొని 'మీ గెలుపు కోసం భార్యా పిల్లలను పక్కన పెట్టి రాత్రింబవళ్లు కష్టపడ్డామని, ప్రస్తుతం మీ వెంట ఉన్న వైసీపీ నాయకుల దెబ్బకు ఊరు వదిలి వెళ్లామని, నీ గెలుపు కోసం కష్టపడినందుకు మమ్మల్నే అణగదొక్కుతావా..? కనీసం గ్రామానికి వచ్చేటప్పుడు మాకు సమాచారం ఇవ్వాలని తెలియదా? అంటూ తీవ్ర స్థాయిలు విరుచుకుపడ్డారు. ఇంతలో ఖాకీలు అక్కడికి చేరుకొని తమ్ముళ్లను శాంతింప చేయడంతో ఎమ్మెల్యే ముందుకు సాగారు.



ఎమ్మెల్యేను అడ్డుకుంటున్న చిన్నహరివాణం తెలుగు తమ్ముళ్లు

నాలుగు గంటల పాటు బైఠాయింపు

ఆదోని టౌన్ : పట్టణంలోకి టిడ్కో గృహాల యజమానులతో కౌన్సిల్ హాల్లో శనివారం ఎమ్మెల్యే డా. పార్థసారథి, కమిషనర్ కృష్ణ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశం అనంతరం వెళ్తున్న ఎమ్మెల్యేను, మున్సిపల్ అధికారులను టీడీపీ నాయకులు రంగస్వామి, బాబూ నాయుడు, బుద్ధారెడ్డి, తిమ్మప్ప, శ్రీనివాస చౌదరి, వెంకటేష్‌లు అడ్డుకున్నారు. అన్న క్యాంటీన్‌ల పనులకు సంబంధించిన తమ బిల్లులను అజెండాలో ఎందుకు పెట్టడం లేదని, వాహనాలకు ఇంత వరకు బిల్లులు ఎందుకు చెల్లించడం లేదని మండిపడ్డారు. కౌన్సిల్ హాల్ నుంచి బయటికి వెళ్లకుండా తలుపులు వేసి బైఠాయించారు. నాలుగు గంటల పాటు గందరగోళం నెలకొంది. వివాదం పెరుగుతుండటంతో డీఎస్పీ సోమన్న, సీఐలు శ్రీరామ్, రామలింగ, నల్లప్ప అధ్వర్యంలో భారీగా పోలీసులు మోహరించారు. కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఎంఈలను బయటికి వెళ్లకుండా అడ్డున్నారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు భూపాల్ చౌదరి అక్కడికి చేరుకొని మున్సిపల్ అధికారులతో చర్చించిన అనంతరం వివాదం సద్దుమనిగింది.



ఎమ్మెల్యే ముందు టీడీపీ నాయకుల బైఠాయింపు

గుండెను కాపాడుకుందాం..

- జీవనశైలి లోపాలే అనర్థాలకు కారణం
- నేడు ప్రపంచ గుండె వ్యాధుల నివారణ దినం

ఆధునిక జీవనశైలి గుండె ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఒకప్పుడు 65-70 ఏళ్ల వయస్సులో కనిపించే గుండె జబ్బులు ప్రస్తుతం 25-35 ఏళ్లలోనే దాడి చేస్తున్నాయి. ఉదయం లేచింది మొదలు ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది వృత్తి, వ్యక్తిగత జీవితంలో ఒత్తిడితో చిత్తవుతున్నారు. తాత్కాలిక ఉపశమనం కోసం చెడు అలవాట్లకు బానిసవుతున్నారు. నిద్రలేమి కొత్త చిక్కులను తెచ్చిపెడుతోంది. ఒత్తిళ్లు, ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం లేకపోవడం, కాలుష్యం, పొగ తాగే అలవాటు వంటి కారణాలతో హృద్రోగుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 1.90 కోట్ల మంది గుండె జబ్బులతో మరణిస్తున్నారు. అలాగే 54 కోట్ల మంది గుండె జబ్బులతో బాధపడుతున్నారు. దీంతో గుండె జబ్బులపై అవగాహన పెంచడానికి వరల్డ్ హార్ట్ ఫెడరేషన్, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రతి ఏటా సెప్టెంబరు 29న వరల్డ్ హార్ట్ డే నిర్వహిస్తోంది. ఈ ఏడాది 'యూస్ హార్ట్ ఫర్ యాక్షన్' అన్న నినాదాన్ని ఇచ్చింది. -కర్నూలు(హాస్పిటల్)



గుండె జబ్బుల్లో కనిపించే ప్రధాన లక్షణం ఆయాసం. ఊపిరితిత్తుల నుంచి గుండెకు రక్తం చేరుకునేటప్పుడు కొంత పీడనంతో నిండుతుంది. గుండె కండరం బలహీనపడినా, గట్టిపడినా గుండె చుట్టు ఉండే పొరగట్టి పడినా, ఈ పీడనం మరింత ఎక్కువవుతుంది. దీంతో ఊపిరితిత్తుల్లోని సూక్ష్మ రక్తనాళాల్లో ఒత్తిడి పెరిగి ద్రవం లీకవుతుంది. ఇలా ఊపిరితిత్తుల్లో నీరు చేరి, వాటిలో వ్యాకోచించడం తగ్గుతుంది. ఇది ఆయాసానికి దారి తీస్తుంది. ముఖ్యంగా రాత్రిపూట ఆయాసం ఎక్కువ ఉంటుంది.

కర్నూలు జీజీహెచ్‌కు పెరిగిన రోగులు

కర్నూలు జీజీహెచ్ కార్డియాలజీ విభాగానికి గుండె రోగుల తాకిడి భారీగా పెరిగింది. 2015-16లో కార్డియాలజీ విభాగానికి రెండు డీఎం సీట్లు రావడంతో ఇక్కడ వైద్యుల సంఖ్య పెరిగింది. ఇప్పటి వరకు ఐదు బ్యాచ్‌లు కోర్సు పూర్తి చేసుకుని వైద్యులుగా బయటకు వెళ్లారు. వైద్యుల సంఖ్య పెరగడంతో గత ఐదేళ్లలో రోగుల సంఖ్య 90,475 మంది ఓపీకి వచ్చారు. వీరిలో 14,597 మంది అడ్మిషన్ చేరారు. 2023లో 21వేల మంది ఓపీకి రాగా, 2024లో ఇప్పటి వరకు 15,840 మంది ఓపీ సేవలు ఉపయోగించుకున్నారు. ప్రస్తుతం కార్డియాలజీ విభాగంలో ప్రొఫెసర్ డా. చంద్రశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లలితకుమారి, ప్రశాంత్, కిరణ్ కుమార్ రెడ్డి, డా. ఉదయ్ బిందు, డా. రవికిరణ్ పని చేస్తున్నారు.

శారీరక శ్రమ లేకపోవడం వల్లే



శారీరక శ్రమ లేకపోవడం కూడా గుండెజబ్బులకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. వాకింగ్, జాగింగ్ లేదా సైక్లింగ్ వంటివి 30 నిమిషాలు శారీరక శ్రమ ప్రతిరోజు చేయాలి. ఇది గుండెను బలపరుస్తుంది. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చేస్తుంది. అలాగే గుండె ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల ఆహారం చాలా ముఖ్యం. జంక్‌ఫుడ్, చక్కెర, అధిక కేలరీలు ఉన్న ఆహారానికి బదులు బాదం, వాల్నట్స్, అవకాడో, క్యారెట్ వంటి పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. - డా. సీఎస్ తేజానందన్ రెడ్డి, కన్సల్టెంట్ కార్డియాలజిస్టు, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు)

జీవనశైలి మార్పుల వల్లే గుండె జబ్బులు



మారుతున్న జీవనశైలిలో మార్పుల కారణంగా గుండె సమస్యలు అధికమవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 1.79 కోట్లు మంది హార్ట్ ఎటాక్‌తో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల కాలంలో రాయలసీమ జిల్లాల నుంచి చిన్న వయస్సులోని వారు గుండెజబ్బులతో వస్తుండటం ఆందోళన కలిగిస్తుంది. ఎవరైనా గుండె జబ్బులపై అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా 55-65 ఏళ్ల మధ్యలో ఉన్న వారు ఎక్కువగా గుండెపోటుకు గురవుతున్నారు. ముందస్తు జాగ్రత్తలతో వీటిని నివారించవచ్చు.

- డా.జి. సందీప్ కుమార్, ఇంటర్వేన్షనల్ కార్డియాలజిస్టు, కిమ్స్ హాస్పిటల్, కర్నూలు

నేడు వరల్డ్ హార్ట్ డే ఉత్సవాలు



వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని ఆదివారం కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో వరల్డ్ హార్ట్ డే ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. ఉదయం కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో ఏ. క్యాంపు హెల్త్ క్లబ్‌లో వైద్య విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశాం. సాయంత్రం సునయన ఆడిటోరియంలో కలెక్టర్ రంజిత్ బాషా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, తిరుపతికి చెందిన కార్డియాలజిస్టు డా. రాజశేఖర్, వరల్డ్ హార్ట్ డేలో పాల్గొంటారు. అనంతరం ఔట్ స్టాండింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్‌గా డా. రాజశేఖర్‌కు అవార్డును అందజేస్తాం.

- డా.పి. చంద్రశేఖర్, ప్రొఫెసర్ ఆఫ్ కార్డియాలజీ, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి

అవగాహన కల్పిస్తున్న హార్ట్ ఫౌండేషన్



ముందస్తు జాగ్రత్తలతో గుండె జబ్బులను నివారించవచ్చునన్న ఉద్దేశంతో కార్డియాలజీ ప్రొఫెసర్ డా.పి. చంద్రశేఖర్ 2002, అప్పటి కలెక్టర్ సాయిప్రసాద్ గౌరవాధ్యక్షుడిగా కర్నూలు హార్ట్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. 2003లో నగరంలోని ఏ. క్యాంపులో హార్ట్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. 2003లో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే నిర్వహిస్తున్నారు. 2005 నుంచి గుండెజబ్బుల నివారణలో విశేష సేవలు చేసిన వైద్యులకు ఔట్‌స్టాండింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ పేరుతో అవార్డును ప్రారంభించారు. 2015లో హార్ట్ హౌస్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి నెలా మొదటి ఆదివారం హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యులతో అవగాహన సదస్సులు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అలాగే హెల్త్ క్లబ్‌లో మెడిటేషన్ హాల్ జిమ్ బ్యాట్‌మింటన్ కోర్సును ఏర్పాటు చేశారు.

గుండె లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు



అప్పటికప్పుడు రక్తనాళాల్లో పూడికలు ఏర్పడటం వల్ల ఆకస్మిక గుండె మరణాలకు దారి తీస్తుంది. చాలా మందిలో బీపీ, మధుమేహం ఉన్నప్పటికీ లక్షణాలు కనబడవు. తెలుసుకునేలోపు నష్టం జరుగుతుంది. కొన్ని లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. ఆయాసం, గుండె నొప్పి, ఎక్కువ చెమటపట్టడం, కళ్లు తిరగడం వంటి లక్షణాలు ఉంటే వైద్యున్ని వెంటనే సంప్రదించాలి.

- డా.ఏ. వసంత కుమార్, సీనియర్ కార్డియాలజిస్టు, శ్రీవిజయదుర్గ కార్డియాక్ సెంటర్, కర్నూలు

గుండెకు సంపూర్ణ రక్షణ



గుండెకు సంపూర్ణ రక్షణకు అవసరమైన విధానాలు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన ఆలోచనలతో గుండెపై భారం వేయకూడదు. పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడటం వల్ల యువతపై గుండె వ్యాధుల ప్రభావం ఎక్కువగా ఉంది. రక్తపోటు, చక్కెర వ్యాధి, కొవ్వును అదుపులో ఉంచుకోగలిగితే గుండె జబ్బులు రావు.

- డా.సి. రాఘవేంద్ర, సీనియర్ ఇంటర్వేన్షనల్ కార్డియాలజిస్టు, జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్, కర్నూలు

దేవునితో రాజకీయం చేస్తే నాశనమే

నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి



మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి

పగిడ్యాల, సెప్టెంబరు 28: దేవునితో రాజకీయం చేసిన వారు నాశనం కాక తప్పదని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. మండల పరిధిలోని పాత ముచ్చుమర్రి గ్రామంలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మతాలకు సంబంధించిన సాంప్రదాయాలను కొనసాగిస్తారని, అలాంటప్పుడు తప్పనిసరిగా డిక్లరేషన్ ఇచ్చి వారి మతాలను గౌరవించడం ఆనవాయితీ అన్నారు. అయితే జగన్ నాలుగు గోడల మధ్యన బైబుల్ చదువుతానని, బయటకు వస్తే హిందువులను, ముస్లింలను గౌరవిస్తానని నాటకాలు ఆడుతున్నాడని విమర్శించారు. తమ మతం మానవత్వం అని చెబుతున్నారని, సీఎంగా ఉన్నప్పుడు నంద్యాలలో ముస్లింలు ఆత్మహత్య చేసుకున్నప్పుడు మానవత్వం ఎక్కడికి పోయిందని ఆమె ప్రశ్నించారు. దొంగ రెడ్లను నమ్మవద్దని, అసలైన రెడ్లను నమ్మి వారి పక్షాన ఉండాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాకరవాడ వెంకటస్వామి, కట్టుబడి శ్రీనివాసనాయుడు తదితరులు ఉన్నారు.

ఆయిల్ ఫాం తోటలతో లాభాలు

జిల్లా ఉద్యానశాఖాధికారి



నర్సరీలో ఆయిల్‌ఫాం మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి

రుద్రవరం, సెప్టెంబరు 28 : రాయలసీమ జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌ఫాం తోటలను పరిచయం చేసిందని, వాటి వల్ల రైతులకు లాభాలు బాగా ఉంటాయని జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు శనివారం అన్నారు. నంద్యాల జిల్లాలో 400 హెక్టార్లు టార్గెట్ లక్ష్యంగా ఉందన్నారు. వీటిలో ఇప్పటి వరకు వంద హెక్టార్లలో అయిల్ ఫాం తోటలు సాగు చేయించామన్నారు. ఒక్కో హెక్టారుకు రూ.71వేల సబ్సిడీ అందుతుందన్నారు. పెద్దకంబలూరు మెట్ట సమీపంలో 3ఎఫ్ అయిల్‌ఫాం ప్రైవేటు నర్సరీలో మొక్కలను పరిశీలించామన్నారు. జిల్లాలో నవభారత్, తుమ్మల ఆగ్రో, పతంజలి అనే సంస్థల ద్వారా అయిల్‌ఫాం తోటలను సాగు చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చాయని అన్నారు. ఈ పంట నాలుగేళ్లలో చేతికందుతుందన్నారు. పంట సాగులో అంతర్ పంటలు కూడా సాగు చేసుకుని రైతులు అధిక లాభాలను పొందవచ్చన్నారు. ఒక్కో ఎకరాలో పది నుంచి 15 టన్నులు దిగుబడి వస్తుందన్నారు,. టన్ను రూ.14 వేల నుంచి 15వేలు ధర ఉంటుందని అన్నారు. సాగు ఖర్చు కేవలం ఎకరాకు రూ.20వేలు వస్తుందన్నారు.

రూ.1.50 కోట్లకు పైగా హోటల్ వ్యాపారి టోకరా

ఆదోని, సెప్టెంబరు 28 : పట్టణంలోని ఓ హోటల్ వ్యాపారి రూ.1.50 కోట్లకు పైగా టోకరా పెట్టినట్టు తెలిసింది. కొన్నేళ్లుగా హోటల్ వ్యాపారం నిర్వహిస్తూ తెలిసిన వారి దగ్గర నుంచి పెద్ద ఎత్తున రోజువారి ఫైనాన్స్ కింద అప్పులు తీసుకున్నాడు. ఒకరికి తెలియకుండా మరొకరితో రోజువారి వడ్డీ, వారం వడ్డీలు, నెలసరి వడ్డీలకు పెద్ద ఎత్తున అప్పులు తీసుకున్నాడు. మొదట్లో సక్రమంగా కట్టేవాడని, సమయం కంటే ముందుగానే ఫైనాన్స్ తీర్చేవాడని పేరు చెప్పని ఓ ఫైనాన్స్ నిర్వాహకుడు తెలిపారు. వారం రోజుల క్రితం ఫైనాన్స్ వాళ్ల ఒత్తిడి చేయడంతో ఎవరికీ చెప్పా పెట్టకుండా హోటల్ దుకాణానికి తాళం వేసి చిత్తగించాడు. దీంతో ఫైనాన్స్ ఇచ్చిన వాళ్ల మాత్రం లబోదిబోమంటున్నారు.

అంత్యక్రియల హాజరుకు అనుమతి

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 28: ఓ మానసిక వికలాంగుడి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తూ కర్నూలు ఎస్సీ, ఎస్టీ సెల్ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి పి.పాండురంగారెడ్డి శనివారం ఆదేశాలు జారీ చేశారు. పెద్దకడుబూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్లుకుంట గ్రామానికి చెందిన సి.లక్ష్మీదేవితో పాటు ఆమె కుటుంబీకులు పది మందిని ఈ నెల 13న పోలీసులు అరెస్టు చేశారు. దీంతో వీరిని కోర్టు రిమాండ్‌కు ఆదేశించింది. అయితే లక్ష్మీదేవి పెద్ద కుమారుడు మానసిక వికలాంగుడు కావడంతో ఆలన పాలన లేక అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. దీంతో గ్రామస్థులు వారి న్యాయవాదికి సమాచారం ఇవ్వడంతో అతను కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి పి. పాండురంగారెడ్డి జ్యుడీషియల్ కాన్ఫరెన్స్‌లో ఉన్నా కోర్టుకు వచ్చి కేసును విచారించారు. అనంతరం ఆ కుటుంబానికి మొత్తం రెండురోజుల పాటు తాత్కాలిక బెయిల్‌ను మంజూరు చేశారు. మృతుడి అంత్యక్రియలు పూర్తి చేసి రెండు రోజులకు తిరిగి కోర్టులో హాజరు కావాలని ఆదేశించారు. దీంతో కుటుంబం మొత్తం శనివారం జైలు నుంచి విడుదలై వారి స్వగ్రామానికి వెళ్లింది.

సార్.. మీ కాళ్లు మొక్కుతా..

- మా భూమి మాకు ఇప్పించండి
- ఆర్డీవో కార్యాలయంలో రైతు కుటుంబం ఆవేదన



రెవెన్యూ సిబ్బంది కాళ్లకు మొక్కుతున్న రైతు కుటుంబ సభ్యుడు



బాధిత రైతు నాగభూషణం

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 28: 'సారు మీ కాళ్లు మొక్కుతా.. మా భూమి మాకు ఇప్పించి న్యాయం చేయండి' అని బాధిత రైతు కుటుంబం శనివారం పత్తికొండ ఆర్డీవో కార్యాలయంలో నిరసనకు దిగింది. ఆస్పరి పెద్ద నాగభూషణం అనే రైతుకు పత్తికొండ పట్టణ శివారులోని సర్వే నెం.744/2లో 16 ఎకరాల 19 సెంట్లు వారసత్వంగా సంక్రమించిన భూమి ఉంది. గత సంవత్సరం డిసెంబరు 2023 వరకు ఆ భూమిపైన సర్వహక్కులు ఉన్నట్లు రికార్డులు ఉన్నాయి. అయితే అదే సర్వే నంబరులోని భూమిలో కొలిమి ఫాతిమాబీకి మూడెకరాల పది సెంట్లు ఉందంటూ రెవెన్యూ అధికారులు రికార్డులు తారుమారు చేశారు. దీంతో బాధిత రైతు నాగభూషణం తన కుమారులు సాంబమూర్తి, వెంకటేశ్వర్లు, హేమాద్రితో పాటు కుటుంబ సభ్యులు ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. తప్పుడు రికార్డులతో తమకు తీరని అన్యాయం చేశారంటూ రెవెన్యూ అధికారులను నిలదీశారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బాధిత రైతు కుటుంబాన్ని నచ్చజెప్పి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

రాయలసీమ ప్రాజెక్టులపై దృష్టి సారించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ఆలూరు, సెప్టెంబరు 28 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి రాజధాని అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టులపైనే కాకుండా రాయలసీమ ప్రాజెక్టులపై కూడా శ్రద్ధ చూపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. శనివారం ఆలూరు ఆర్అండ్‌బీ గెస్టు హౌస్‌లో ఆయన మాట్లాడారు. రాయలసీమ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో వెనుకబాటుకు గురైన నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. ప్రాజెక్టులు లేకపోవడంతో వర్షంపైనే ఆధారపడి సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోవలసిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలూరు ప్రాంతంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు.. పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కార మార్గానికి కృషి చేస్తామని చెప్పారు. వేదవతి ప్రాజెక్టు పూర్తి చేందుకు ప్రయత్నిస్తామన్నారు. అనంతం ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్‌తో కలిసి సమస్యలపై చర్చించారు. సమావేశంలో సీపీఐ నాయకులు గిడ్డయ్య, రామాంజినేయులు, భూపేష్ పాల్గొన్నారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు



మంత్రాలయం మంఠం ప్రాంగంణంలో భక్తులు

మంత్రాలయం, సెప్టెంబరు 28: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. శనివారం సాయంత్రం నుంచి భక్తుల రాక మొదలైంది. దక్షణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్యపూజలకు విరామం కల్పించారు. శనివారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయ కొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. దీంతో మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహాముఖ ద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారాయి.

పత్తి రైతులు సీసీఐ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి

మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 28: రాష్ట్ర ప్రభుత్వం జీవో.నెం.545 ద్వారా పత్తి పంటకు కనీస మద్దతు ధర పొడుగు పింజ రకానికి క్వింటానికి రూ.7,521, పొటి పింజ రకానికి రూ.7,121 సీసీఐ కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ రామాంజనేయులు శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. రైతులు బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర తగ్గినప్పుడు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందేందుకు సిద్ధం కావాలని, పత్తి పంట ఉత్పత్తులను బాగా ఆరబెట్టి దుమ్ము ధూళి లేకుండా శుభ్రపరిచి పత్తి కొనుగోలు కేంద్రానికి తీసుకుని రావాలని రైతులకు సూచించారు. మద్దతు ధర పొందాలంటే పత్తి గింజ పొడవు 29.50 ఎంఎం నుంచి 30.50 ఎంఎం వరకు ఉండాలని అన్నారు. అదే విధంగా మైక్రో నియర్ వాల్యూ 3.5 నుంచి 4.3 వరకు ఉండాలని స్పష్టం చేశారు.

ఎయిర్‌పోర్టులో సౌకర్యాలు మెరుగుపర్చండి

కలెక్టర్ పి. రంజిత్ బాషా



కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 28: కర్నూలు ఎయిర్‌పోర్టులో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎరోడ్రోమ్ కమిటీ, ఎయిర్ ఫీల్డ్ ఎన్విరాన్‌మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిర్‌పోర్టులో మహిళా పోలీసులను కూడా ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎయిర్‌పోర్టు నుంచి కర్నూలు వెళ్లే ప్రయాణికులకు విమానాశ్రయం నుంచి ఓర్వకల్లుకు బస్సు సౌకర్యం కల్పించాలని, ఓర్వకల్లు నుంచి కర్నూలుకు వెళ్లే బస్సును వయా ఎయిర్‌పోర్టు నుంచి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఎయిర్‌పోర్టు వారు కూడా ఒక ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు, డీఎఫ్‌వో డీఎంహెచ్‌వో, తహసీల్దార్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047 డిబేట్‌కు కోసిగి విద్యార్థి ఎంపిక



ప్రణయ్ కుమార్ రెడ్డి

కోసిగి, సెప్టెంబరు 28: స్వర్ణాంధ్ర-2047 రాష్ట్ర స్థాయి డిబేట్‌కు కోసిగిలోని మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థి ప్రణయ్ కుమార్ రెడ్డి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్. సమీరారెడ్డి తెలిపారు. ప్రణయ్ కుమార్‌రెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



ప్యాలకుర్తిలో లబ్ధిదారులకు అవగాహన

ఓర్వకల్లు, సెప్టెంబరు 28: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ ఏఎల్ ప్రభాకర్ అన్నారు. శనివారం ఓర్వకల్లులోని సచివాలయంలో మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమంలో భాగంగా గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను అక్టోబరు నెలాఖరికి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రంగనాథ గౌడు, టీడీపీ నాయకులు గోవిందరెడ్డి, మోహన్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, కురువ పెద్దయ్య, ఏఈ రామయ్య, ఈవోఆర్డీ సుబ్బరాయుడు, ఏపీఎం కాంతారెడ్డి పాల్గొన్నారు.

కోడుమూరు (రూరల్): ప్రతి కుటుంబానికి సొంత ఇంటి కల నిజం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ డీఈ వాసుదేవరావు తెలిపారు. మండలంలోని ప్యాలకుర్తి, గోరంట్ల గ్రామాల్లో హౌసింగ్ లబ్ధిదారులకు శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ అఫ్రోజ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సి. బెళగల్: మన ఇల్లు మన గౌరవం అనే కార్యక్రమాన్ని శనివారం మండలంలోని బురాన్‌దొడ్డి, కంబందహల్ గ్రామాలలో గ్రామ సర్పంచులు రామాంజినేయులు, ఈరమ్మ అధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి శ్యామల మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వందరోజులలో మన ఇల్లు మన గౌరవం అనే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పంచాయతీ ప్రత్యేక అధికారులు గోసెనాయక్, ఏపీవో రామన్న, హౌవుసింగ్ ఏఈ సుమంత్, ఎంపీడీవో రాముడు, ఈవోఆర్డ్ సందీప్ పాల్గొన్నారు.

పూడికతీత పనుల్లో జాప్యం చేయవద్దు

● నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు



కర్నూలు (న్యూసిటీ), సెప్టెంబరు 28: నగరంలో మురుగు కాలువల్లో చేపట్టాల్సిన పూడికతీత పనుల్లో జాప్యం చేయవద్దని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. శనివారం ప్రకాష్‌నగర్, రోజా వీధి, అశోక్‌నగర్, సంకల్‌బాగ్ తదితర ప్రాంతాలలో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. మ్యాన్‌హోల్స్ ధ్వంసమైతే వెంటనే పారిశుధ్య సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు కొత్త ఇనుప చువ్వను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి కే విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మునిస్వామి పాల్గొన్నారు.

నగరాన్ని అభివృద్ధి చేయండి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 28 : నగరాన్ని అభివృద్ధి చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పరిగెల మురళీకృష్ణ అన్నారు. శనివారం నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబును జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి వినతి పత్రం ద్వారా కోరారు. ఆయన మాట్లాడుతూ నగరంలో ఉన్న పార్కులు శుభ్రం చేయించి చిన్నపిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు, పెద్దలకు అవేర్నెస్ కార్యక్రమాలు, వాకింగ్ ట్రాక్‌లు, పార్కులకు వాచ్‌మెన్లను నియమించి వృద్ధులు రోడ్ల మీద వాకింగ్ చేయకుండా ప్రత్యేక ప్లాట్ ఫామ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. వెంకటరమణ కాలనీలోని ప్రేమ్ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 3లో 4 లైన్లలో క్లినింగ్, వీధి దీపాలు, చెట్లు నాటిలే చూడాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు అనంతరత్నం మాదిగ, లాజరస్, వెంకట సుజాత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు

ప్లాస్టిక్ వాడకం.. ప్రమాదకరం

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 28 : ప్లాస్టిక్ వాడకం ప్రమాదకరమని ఇన్‌చార్జి ఉపకులపతి, ప్రొఫెసర్ పీఎస్‌షా వలీఖాన్ అన్నారు. శనివారం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఎ యూనిట్ ఆధ్వర్యంలో చిన్న టేకూరు జడ్పీ హైస్కూల్‌లో స్వచ్ఛతహి సేవా కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జీ ఉపకులపతి మాట్లాడుతూ బకెట్లు, డబ్బాలు, సంచులు ఇలా ఇంట్లో ఏ మూల చూసినా ఖచ్చితంగా ఏదో ఒక రూపంలో ప్లాస్టిక్ కనిపిస్తూనే ఉంటుందన్నారు. అంతక ముందు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ లోక్‌నాథ్, గ్రామసర్పంచ్ పి. లక్ష్మన్న, కార్యదర్శి లక్కప్ప, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, పాల్ కృపాకర్, వెంకటప్ప, వాలంటీర్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రోగులను నవ్వుతూ పలకరించండి

● జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వ్యవస్థాపకుడు డా.వి. బ్రహ్మారెడ్డి



మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

కర్నూలు (హాస్పిటల్), సెప్టెంబరు 28: ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులను నవ్వుతూ పలకరిస్తూ సమాధానం చెప్పాలని, అప్పుడే రోగి సగం రోగం నయమవుతుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వ్యవస్థాపకుడు డా.బ్రహ్మారెడ్డి అన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓల్డ్ సీఎల్‌జీలో నర్సింగ్ సిబ్బందికి శనివారం మోటివేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జరిగింది. ఇందులో ఆయన మాట్లాడుతూ రోగులు ఎన్నో సమస్యలతో ఆసుపత్రికి వస్తుంటారని, నర్సింగ్ సిబ్బంది వారిపై కోప్పడకుండా అప్యాయంగా పలకరించాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ నర్సింగ్ సిబ్బంది వృత్తి ఒత్తిడితో కూడుకుందని, దీని తట్టుకుని రోగులకు సేవలు అందించాలన్నారు. కొవిడ్ నుంచి బయటపడిన తర్వాత నర్సింగ్ సిబ్బందికి ప్రాధాన్యత పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.బి.హేమనళిని, డిప్యూటీ సివిల్ సర్జన్ డా.వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డా.శివబాల, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి, హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మి పాఠశాలలో ఫుడ్ కార్నివాల్



ఫుడ్ కార్నివాల్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 28: స్థానిక శ్రీలక్ష్మి పాఠశాలలో స్నాప్ కమ్యూనికేషన్ స్కిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు ఆహారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరై మాట్లాడుతూ పాఠశాలలో ఇలాంటి ఫుడ్ కార్నివాల్ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యతో పాటు సమాజంలోని అనేక విషయాలపై అవగాహన కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్వేపల్లి పాఠశాల కరస్పాండెంట్ శేషన్న, ప్రధానోపాధ్యాయులు అరుణశ్రీ, మాధవీలత, కో ఆర్డినేటర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జయంతి ఉత్సవాలు

జిల్లాలో భగత్‌సింగ్, 'గుర్రం జాషువా' జయంతిని ఘనంగా జరుపుకున్నారు. వారి చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భగత్‌సింగ్ బ్రిటీష్ సామ్రాజ్యవాదుల గుండెల్లో సింహస్వప్నమని, ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖులు పిలుపునిచ్చారు. సంస్కరణలే లక్ష్యంగా జాషువా తన రచనలతో ముందుకు పోయారని గుర్తు చేశారు. ఆయన చిత్ర పటం వద్ద నివాళి అర్పించారు.



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, సీపీఐ నాయకులు



గూడూరులో...



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



అరసం అధ్వర్యంలో జాషువా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రచయితలు



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భగత్‌సింగ్‌కు నివాళి



కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల్లో జాషువా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు



ఓర్వకల్లులో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎంపీ

కల్లూరు, సెప్టెంబరు 28: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం షరీన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంద రోజులు ప్రభుత్వ పాలనలో సీఎం చంద్రబాబు 5 ముఖ్యమైన హామీలపై సంతకం చేశారన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులకు మోగా డీఎస్సీ, పింఛన్ రూ.4 వేలకు పెంపు, అన్నాక్యాంటీన్‌లు పునఃప్రారంభం, ల్యాండ్‌టైట్లింగ్ యాక్ట్ రద్దు, ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు అందిస్తున్నారని తెలిపారు. సూపర్‌సిక్స్‌ను ప్రజలకు అందజేస్తామన్నారు. నంద్యాల పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోని మండలాల్లో టీడీపీ కార్యాలయాలు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. లడ్డూను కల్తీ చేసిన వారు ఎంతటి వారైన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జయరాముడు, సంజన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లడ్డూ ఘటనలో దోషులను శిక్షించాలి: జనసేన



వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న నాయకులు

కర్నూలు (రూరల్), సెప్టెంబరు 28: తిరుమలలో వెంకటేశ్వర స్వామి లడ్డూ తయారీలో కల్తీ కలిపిన దోషులను కఠినంగా శిక్షించాలని కోడుమూరు నియోజకవర్గం జనసేన సమన్వయకర్త ఆకెపోగు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర శ్రేయస్సు కోసం జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడు గ్రామంలో శనివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో రాంబాబు వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వార్లకు అభిషేకం, పూజా కార్యక్రమం నిర్వహించారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఓర్వకల్లు, సెప్టెంబరు 28: మండలంలోని కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి 40పై శనివారం తెల్లవారుజామున నన్నూరు గ్రామ సమీపాన గల అభి డాబా సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు. బాధితుడ్ని హైవే మొబైల్ అంబులెన్సులో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆ వ్యక్తి వివరాలు తెలిసిన వారు వెంటనే ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్‌లో 9121101067 నెంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జగన్ డిక్లరేషన్ ఎందుకు ఇవ్వరు?

● టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 28 : తిరుమల వెంకటేశ్వరస్వామిపై భక్తి ఉంటే మాజీ సీఎం జగన్ డిక్లరేషన్ ఎందుకు ఇవ్వరు అని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి విజయకుమార్ ప్రశ్నించారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జగన్‌రెడ్డి హిందువులు పవిత్రంగా భావించే లడ్డులో కల్తీ నెయ్యి ఎలా ఉపయోగించారని మండి పడ్డారు.

'రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించాలి'



మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 28: ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్ రవీంద్రబాబు అన్నారు. శనివారం ప్రపంచ రేబిస్ వ్యాధి దినం సందర్భంగా, నగరంలోని జిల్లా పశుసంవర్ధక శాఖ బహుళార్థక పశువైద్యశాలలో, ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి. శ్రీనివాస్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం జరిగింది. రవీంద్రబాబు మాట్లాడుతూ ఏటా సెప్టెంబరు 28న ప్రపంచవ్యాప్తంగా కుక్కల నుంచి జంతువులకు సంక్రమించే ప్రాణాంతక వైరస్ వ్యాధి రేబిస్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. అయితే 2030 ఏడాది లోగా పెంపుడు కుక్కలకు వైరస్ వ్యాధి రేబిస్ అరికట్టేందుకు ప్రణాళికలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ డివిజనల్ డీడీ డాక్టర్ దుర్గా ప్రసన్న బాబు, వీపీసీ డీడీ డాక్టర్ హేమంతకుమారి, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కోడుమూరు: ప్రపంచ రేబిస్ దినోత్సవ సందర్భంగా పట్టణం పురవీధుల్లో వైద్యశాఖ ఆద్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని డీఎల్‌పీవో తిమ్మక్క ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ మదనశేఖర్, పంచాయతీ కార్యదర్శి అజయ్ భాస్కర్, వైద్య బృందం నరసప్ప, కమాల్ సాహెబ్, ఉమాబాయి తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 28: తప్పుడు పత్రాలతో గుర్తింపు పొందిన బీఈడీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. విజయవాడలో హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ సెక్రటరీ మహ్మద్ నజీర్‌కు వినతి పత్రం అందజేశారు. ధృవపత్రాలు పరిశీలన చేసిన అధికారులపై ఉన్నతస్థాయి కమిటీతో విచారణ జరిపించాలన్నారు.

● రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని దూర విద్యా కేంద్రాలుగా మారిన బీఈడీ కళాశాలలపై విచారణ నిర్వహించి గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ ఉదయ్ కుమార్ ఉన్నత విద్యామండలి కార్యదర్శి మహ్మద్ నజీర్‌కు వినతి పత్రం అందజేశారు.

నేటి నుంచి సీబీఎస్సీ ఫుట్‌బాల్ పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 28: ఏపీ, తెలంగాణ సీబీఎస్సీ జోన్ 7 క్లస్టర్ ఫుట్‌బాల్ బాలుర పోటీలు ఆదివారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు లక్ష్మీపురంలోని రిడ్జ్ పాఠశాలలో జరుగుతాయని రవీంద్ర విద్యాసంస్థల ఛైర్మన్ జీఎం మోహన్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర పాఠశాలలో ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగే పోటీలకు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 150 పాఠశాలల నుంచి 3వేల మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రిడ్జ్ పాఠశాల సీఈవో గోపినాథ్, సీఈవో వంశీధర్, ప్రిన్సిపాల్ రాజ్‌కమల్, పోటీల నిర్వహణ అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రన్ పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలను దెబ్బతీసింది సీఎం చంద్రబాబే

● మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కృష్ణానగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భగవద్గీతను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు, సెప్టెంబరు 28: తిరుమల పవిత్రతను, వేంకటేశ్వరస్వామి వైభవాన్ని తక్కువ చేసి హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతీసింది సీఎం చంద్రబాబునాయుడేనని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. తిరుమల లడ్డూపై అధికార పార్టీ నాయకుల అసత్య ప్రచారానికి వ్యతిరేకంగా ఆ దేవదేవుడు సీఎంకు సద్బుద్ధి ప్రసాదించాలని శనివారం కృష్ణానగర్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేపట్టారు.

కర్నూలు(న్యూసిటీ): శ్రీవారి లడ్డు విషయంలో అబద్ధపు ప్రచారంలో భక్తుల మనోభావాలను దెబ్బతీయడం సరికాదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ శనివారం వెంకటరమణ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నగర మేయర్ బీవై. రామయ్య, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సి. బెళగల్ క్రిష్ణదొడ్డిలోని కోన వెంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న నాయకులు

సి. బెళగల్: మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో వెలసిన కోనవెంకటేశ్వర స్వామికి వైసీపీ నాయకుడు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, గూడూరు ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ మౌలాలి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ప్రజలకు చేసిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శేఖరెడ్డి, మాజీ ఎల్లెల్సీ ఛైర్మన్ చిన్న కొండయ్య, నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు: తిరుమల లడ్డూపై రాజకీయం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తగదని జడ్పీటీసీ రఘునాథరెడ్డి అన్నారు. స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు క్రిష్ణారెడ్డి, రమేష్‌నాయుడు, రవికుమార్‌రెడ్డి, లింగన్న, లాయర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

పండ్ల తోటలను పెంచుకోండి

సి. బెళగల్, సెప్టెంబరు 28: సన్న కారు రైతులు పండ్ల తోటలను పెంచుకోవాలని మండల ఏపీవో రామన్న రైతులకు తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో మండలంలోని రైతులకు మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. ఏపీవో మాట్లాడుతూ మండలంలోని పండ్లతోటలను పెంచుకోడానికి ముందుకు వచ్చిన రైతులు ప్రభుత్వం యాభైశాతం సబ్సిడీ అందజేస్తుందన్నారు. మండల ప్రత్యేక అధికారి శ్యామల, ఏఎస్‌వో ఆదినారాయణ, ఎంపీడీవో రాముడు, ఈవోఆర్డ్ సందీప్ రైతులు ఉన్నారు.

నేడు 'అక్కినేని పురస్కారాలు' ప్రదానం

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 28: నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో గత రెండు రోజులుగా కొనసాగుతున్న తెలుగు సినీ కథానాయకుడు 'అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి' వేడుకల ముగింపు సభ ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో ఉంటుందని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ హాజరవుతారన్నారు. అనంతరం విజయవాడకు చెందిన వెలగలేరు ఆర్ట్స్ సంస్థ వారి నంది బహుమతి పొందిన 'రాత' నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

సామాజిక సేవ చేయాలి

● డా.బి.శంకర్‌శర్మ

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 28: ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో ఎంతో కొంత భాగాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ అన్నారు. శనివారం నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఉన్న హోం ఆఫ్ హోప్ అనాథ ఆశ్రమానికి ఆయన నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. అనాథఆశ్రమాలు, వృద్ధాశ్రమాల నిర్వాహకులు ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి వాటిని నిర్వహిస్తుంటారని, అలాంటి వారికి సహాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు.



నిత్యావసర సరుకులు అందిస్తున్న డా.శంకర్‌శర్మ

క్రీడలతో శారీరక ఉల్లాసం : ఎమ్మెల్యే



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కోడుమూరు, సెప్టెంబరు 28: క్రీడల వలన శారీరక ఉల్లాసం పాటు మానసిక ఉత్సాహాన్ని ఇస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. స్థానిక జీవీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గెలుపు, ఓటమిని సమానంగా స్వీకరించాలని అన్నారు. అనంతరం స్కూల్ పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను సన్మానించారు. విజయవాడ వరద బాధితుల కోసం విద్యార్థుల నుంచి సేకరించిన విరాళాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేఈ మల్లికార్జునగౌడ్, డీలర్ నారాయణ, గంగాధర్, రాముడు, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

'సమాజ హితానికి మంచి సాహిత్యం అవసరం'



జాతీయ కవయిత్రుల సమ్మేళనం ప్రారంభిస్తున్న మాజీ మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ ఎన్ శమంతకమణి

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 28: సమాజ హితానికి మంచి సాహిత్యం ఎప్పుడూ అవసరమేనని కర్నూలు మార్కెట్ యార్డు మాజీ ఛైర్‌పర్సన్ నగరూరు శమంతకమణి అన్నారు. శనివారం నగరంలోని ఆర్టీసీ కాలనీలోని గణేశ్ సదన్‌లో గణేష్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఏడవ జాతీయ కవయిత్రుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శమంతకమణి జ్యోతిప్రజ్వలన చేశారు. గణేశ్ సాహితీ సంస్థ అధ్యక్షుడు కొత్తూరు సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ 2018 నుంచీ గణేశ్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన కవయిత్రులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హైదరాబాదుకు చెందిన కవయిత్రి లక్ష్మీ పద్మజకు, కర్నూలుకు చెందిన కవయిత్రి బెన్నమ్మకు 'సావిత్రీబాయి పూలే' అవార్డును అందజేశారు. అనంతపురం నగరానికి చెందిన కవయిత్రి సింగాడి శోభ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవయిత్రులు నాగజ్యోతి, సువర్ణజోషి, కల్యాణదుర్గం స్వర్ణలత, లీలావతి, హైమా, నీరజ, యజ్ఞశ్రీ ప్రసంగించారు.

'భగవద్గీత వ్యాప్తికి డీవీ రమణ కృషి ప్రశంసనీయం'



గీతారత్న పురస్కార గ్రహీత డీవీ రమణ దంపతులను సత్కరిస్తున్న ధార్మిక సంస్థల ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 28: భగవద్గీత వ్యాప్తికి ధార్మిక వేత్త డీవీ రమణ చేస్తున్న కృషి ప్రశంసనీయమని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని సంకల్‌బాగ్‌లోగల విద్యా ప్రకాశానందగిరి స్వామి గీతా ప్రచార ధామంలో గత 40 ఏళ్లుగా భగవద్గీత వ్యాప్తికి కృషి చేస్తున్న గీతారత్న పురస్కార గ్రహీత డీవీ రమణ దంపతులను వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సాయిరెడ్డి మాట్లాడుతూ నగరంలో విద్యా ప్రకాశనందగిరి గీతా ప్రచార సంఘం స్థాపించి డీవీ రమణ ధార్మిక మార్గాన్ని చూపుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ జిల్లా ఇన్‌చార్జి స్వామిని సుప్రేమానంద, గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మోక్షేశ్వరుడు, సీతారామ కల్యాణ ఉత్సవ సమితి సభ్యులు నాగోజీరావు, మహాబలేశ్వర్, జగన్నాథ గుప్త, ఇల్లూరి రమణ, సింహాద్రి రమేష్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో డీవీ రమణ దంపతులను శాలువ, జ్ఞాపికలు అందజేసి పుష్పమాలలతో ఘనంగా సత్కరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 15 కేసులు నమోదు

కర్నూలు, సెప్టెంబరు 28: నగరంలో ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి 15 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. స్థానిక సీ క్యాంపు సర్కిల్ వద్ద ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు పెద్ద ఎత్తున డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 12 మంది ద్విచక్ర వాహనదారులు, ముగ్గురు ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. వాహనాలను స్వాధీనం చేసుకుని వీరిని కోర్టులో హాజరు పరుస్తామని సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఆర్ఎస్ఐ డీఏ హుసేన్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

ఏపీజేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా ఆప్టా కాకి ప్రకాష్‌రావు



కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 28: విజయవాడలో జరిగిన ఏపీ జేఏసీ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికలో కర్నూలు జిల్లా కర్నూలు మండలం ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పని చేస్తున్న కాకి ప్రకాష్‌రావు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఏపీ ప్రైమరీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న ప్రకాష్‌రావు ఉపాధ్యాయ సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ మొట్టమొదటిసారిగా ఆప్టా సంఘం నుంచి ఏపీజేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక అయ్యారు. ఆప్టా జిల్లా అధ్యక్షుడు ఎం.మధుసూదన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సేవాలాల్ నాయక్, జిల్లా కోశాధికారి వినోద్ కుమార్, ఆప్టా రాష్ట్ర నాయకులు మునగాల మధుసూదన్‌రెడ్డి, రాజసాగర్, గోపాల్, ఖాదీరుల్లా శుభాకాంక్షలు తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

పెద్దకడుబూరు, సెప్టెంబరు 28: మండలంలోని బాపులదొడ్డి గ్రామంలో వైఎస్ విగ్రహాన్ని కూల్చివేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు పురుషోత్తం రెడ్డి, రాంమోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రవిచంద్ర రెడ్డి, దొడ్డిమేకల సర్పంచ్ చంద్రశేఖర్, ఈరన్న, ముక్కరన్న, అర్లప్ప, మూకిరెడ్డి, ఎంపీటీసీ మహదేవ పాల్గొన్నారు.

అనుమతితోనే కొమ్మలు తొలగించాం

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 28: బనవాసి కేవీకేలోని చెట్ల కొమ్మలను అధికారుల అనుమతితోనే తొలగించామని కో-ఆర్డినేటర్ రాఘవేంద్రచౌదరి శనివారం తెలిపారు. 50 ఎకరాల భూమి ఉండగా, పొద్దుతిరుగుడు, కొర్ర, సజ్జ తదితర పంటలను సాగుచేసున్నామని, పెద్ద చెట్లు ఉండటంతో కోతులు, పక్షులు చెట్లపై ఉండి పంటను నాశనం చేస్తున్నాయని, అనుమతితో కొమ్మలను తొలగించామని తెలిపారు.

జీవితాలను నాశనం చేసుకోవద్దు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 28: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోదని ట్రాఫిక్ సీఐ ఘంటా సుబ్బారావు సూచించారు. శనివారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండి, చెడు అలవాట్లకు బానిసలు కావొద్దని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నిరు. ప్రిన్సిపాల్ సంజన్న, ఎస్ఐ లక్ష్మన్న, అధ్యాపకులు గోవిందరాజులు, సూరిబాబు పాల్గొన్నారు.

పోలీసుల శ్రమదానం

మంత్రాలయం, సెప్టెంబరు 28: మంత్రాలయం, మాధవరం పోలీస్‌స్టేషన్లు, నివాసాల ఆవరణలో ఎస్పీ ఆదేశాల మేరకుసీఐ రామాంజులు, ఎస్ఐలు పరమేష్ నాయక్, విజయకుమార్ ఆధ్వర్యంలో శనివారం పోలీసులు శ్రమదానం చేశారు. ఏఎస్ఐ బందెనవాజ్, పెద్దయ్య, కృష్ణయ్య, వీరేష్, గురుమూర్తి, దశరథరాముడు, లక్ష్మీకాంత్, వీరాంజనేయులు, హనుమంతు, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో చేసిందేమీ లేదు



మాట్లాడుతున్న శ్రీదేవి

క్రిష్ణగిరి, సెప్టెంబరు 28: వంద రోజుల్లో టీడీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆరోపించారు. ఇంత వరకు తిరుమల లడ్డూ నాణ్యతపై మాట్లాడిన చంద్రబాబు ఇప్పుడు మాజీ సీఎం జగన్ డిక్లరేషన్ ఇవ్వలేదని తిరుమల పర్యటనను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ఎంపీపీ కంగాటి వెంకట్రామిరెడ్డి, రామక్రిష్ణాపురం రంగనాయకులు, మధుసూదన్ రెడ్డి, మాధవ రావు, అమకతాడు బాలు, జయరామిరెడ్డి, నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 28: మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు ఇవ్వాలని సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. శనివారం కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చారు. సెప్టెంబరు 30న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నామన్నారు. ఇస్మాయిల్, నాగరాజు, రంగన్నగౌడ్, మునీంద్ర, జయన్న, దుర్గన్న, నూర్‌బాషా, రంగస్వామి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇలా వచ్చి.. అలా వెళ్లి పోతున్నారు



ఖాళీగా గూళ్యం- 2 సచివాలయం

హాలహర్వి, సెప్టెంబరు 28: మండలంలో సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నారని తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గూళ్యం గ్రామంలో మూడు సచివాలయాలు ఉండగా, మూడింట్లో శనివారం సిబ్బంది అందుబా టులో లేరు. పనుల నిమిత్తం వచ్చినవారు నిరాశతో వెనుదిరిగారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

కోసిగి, సెప్టెంబరు 28: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ఖలీల్ అహ్మద్ సూచించారు. శనివారం కబడ్డీ క్రీడాకారులకు ఉపాధ్యాయుడు బి.మహేష్ కుమార్ సొంత నిధులతో క్రీడా దుస్తులను అందజేశారు.

క్యారమ్స్‌లో సత్తా చాటిన న్యాయవాదులు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు28: రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఎమ్మిగనూరు న్యాయవాదులు సత్తా చాటారు. శనివారం రాజమండ్రిలో నిర్వహించిన క్యారమ్స్ పోటీల్లో న్యాయవాదులు సింగిల్స్‌లో డబుల్స్‌లో రామకృష్ణ నాయుడు, రాజమండ్రికి చెందిన శంకర్‌పై 0-25 పాయింట్లతో అలాగే డబుల్స్‌లో తిరుపతి జట్టుపై గోపాలకృష్ణ, వాల్మీకి రామకృష్ణ నాయుడు 13 పాయింట్లతో విజయం సాధించారు.

ఇద్దరి అరెస్టు

ఆదోని రూరల్ సెప్టెంబర్ 28: మండలంలోని ఢణాపురానికి చెందిన బీమా, నాగరాజును అరెస్టు చేసి, కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. వివరాల మేరకు.. శనివారం గ్రామ శివార్లలో అదుపులోకి తీసుకొని, రెండు బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుఉన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

మద్దికెర, సెప్టెంబరు 28: మండలంలోని పెరవలిలో అక్రమ కట్టడాలను శనివారం పంచాయతీ అధికారులు కూల్చివేశారు. కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో మెయిన్ బజారులో కాలువలను పూడ్చి కట్టిన కట్టడాలను కొలతలు వేసి కూల్చివేశారు. స్థలాలను ఆక్రమించి ఎవరైనా అక్రమ కట్టడాలను నిర్మిస్తే సహించమని కార్యదర్శి హెచ్చరించారు.

ఎందుకు ఇలా..!

- అస్వస్థతకు గురవుతున్న విద్యార్థినులు
- రెండు రోజుల్లో ఏడుగురు ఆసుపత్రిపాలు
- సరైన ఆహారం అందించకపోవడం వల్లేనా..?



విలేకరులకు తమ బాధలను తెలుపుతున్న విద్యార్థినులు(ఫైల్)



ఈ రేకుల షెడ్డులోనే చదువుకోవాలి

ఆదోని, సెప్టెంబరు 28: ఆదోని పట్టణంలోని రాయచోటి సుబ్బయ్య కాలనీలో ఉన్న బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో ఏడుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇంటర్ చదువుతున్న 113 మంది విద్యార్థినులు వసతి గృహంలో ఉంటున్నారు. రెండు రోజులుగా ఏమైందో ఏమో కాని, ఒక్కొక్కరు కడుపు నొప్పి, తలనొప్పి, వికారంగా ఉందంటూ ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరుతు న్నారు. ఆర్ఎస్ పెండేకల్లుకు చెందిన భాగ్య అనే విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉన్న కారణంగా కర్నూలుకు తీసుకెళ్లారు. తలలో నరాలు చిట్లిపోయాయని, వారం రోజులు ఉంటే కూడా ఏమి చెప్పలేమని వైద్యులు చెబుతున్నారు.

ఫ్యాన్లు లేని రేకుల షెడ్డులో స్టడీ హావర్స్

వసతి గృహం మూడు అంతస్తుల మేడలో నిర్వహిస్తున్నప్పటికీ స్టడీ హావర్స్ మాత్రం రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. అందులో ఒక్క ఫ్యాన్ కూడా లేకపోవడంతో విద్యార్థినులు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. మరుగుదొడ్లు, మూత్ర శాలలు ఉన్నా నీటి సౌకర్యం లేకపోవడంతో మూడంతస్తుల భవనం నుంచి బకెట్ ద్వారా తెచ్చుకోవాల్సి వస్తోంది. వారానికి ఒకసారి తాగునీరు వస్తుండటంతో ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిలువ ఉంచి వాడుకుంటున్నారు. చేస్తారని కన్నీటి పర్యంతమయ్యారు.

ఉడికీ ఉడకని అన్నం

ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు వడ్డిస్తున్నా రని, ఉదయం టిఫిన్ సరిగా లేదని విద్యార్థినులు చెబుతున్నారు. పూరిలైతే రెండు మాత్రమే పెడుతున్నారని, మరోసారి అడిగితే కసురుకుంటున్నారని వాపోతున్నారు. పాలు ఇవ్వరని, స్నాక్స్ కూడా పెట్టడం లేదని, ఎవరికైనా చెబితే తరువాత వేధిం పులకు గురిచేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

బీసీలకు న్యాయం చేయాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న వెంకటేశ్

తుగ్గలి, సెప్టెంబరు 28: నామినేటెడ్ పదవుల్లో బీసీలకు న్యాయం చేయాలని టీడీపీ నాయకుడు మిద్దె వెంకటేశ్ యాదవ్ కోరారు. శనివారం బీసీ సంక్షేమ మంత్రి సవితను కలిసి తనకు శ్రీశైలం ట్రస్టు డైరెక్టర్ పదవి ఇవ్వాలని వినతిపత్రాన్ని ఇచ్చారు. కేఈ శ్యాంబాబును గెలిపించుకున్నామని, తనకు అవకాశం ఇవ్వాలన్నారు.

అత్యాచారాలను అరికట్టాలి

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 28: దళిత గిరిజనులపై అత్యాచారాలను అరికట్టాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం జ్యోతిబాపూలే సత్యశోధక సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. సమాజంలో మహిళలు, మైనార్టీలపై దాడులు కుల వివక్ష అసమానతలు, అణిచివేతలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని నిరోధించడంలో పాలకులు విఫలం చెందారని ఆరోపించారు. వీటికి వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపుని చ్చారు. ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, వెంకప్ప రాజు, మనీ, అఖండ, తిక్కస్వామి, ఈరన్న పాల్గొన్నారు.

జాషువా సమాజాన్ని మేల్కొల్పారు



బహుమతులు అందజేస్తున్న కలం ప్రహ్లాద్

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 28: గుర్రం జాషువా తన సాహిత్యం ద్వారా సమాజాన్ని మేల్కొల్పారని అరసం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద అన్నారు. శనివారం గుర్రం జాషువా జయంతి పురస్కరించుకొని నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. జాషువా స్వయంగా అగ్రవర్ణ భావజాలానికి గువుతూ ఆధిపత్యాన్ని తన పద్య కవిత ద్వారా ఎదుర్కొన్నారన్నారు. తాను విశ్వన రుడనని చాటిన మహాకవి అని కొనియాడారు. గబ్బిలం కావ్యం ఆనాటి సామాజిక పరిస్థితులకు అద్దం పడుతుందన్నారు. హెచ్ఎం అలీమ్ సిద్ధికి, ఉపాధ్యాయులు ప్రసాద్, సుధాకర్ బాబు, జాన్ విక్టర్ పాల్గొన్నారు.

నిర్మాణాలను పూర్తి చేసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 28: లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈ ప్రసాద్ తెలిపారు. శనివారం బోడబండ గ్రామంలో మన ఇల్లు.. మన గౌరవం గృహ నిర్మాణ లబ్ధిదారులుకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో బంగారమ్మ, మాజీ ఎంపీపీ శంకరయ్య పాల్గొన్నారు. పంచాయతీకి మొత్తం 405 గృహాలు మంజూరు కాగా, ఇప్పటికే 227 పూర్తయ్యాయన్నారు. తెలుగు యువత నాయకులు సురేష్‌చౌదరి, నరేంద్ర, దాసు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 28: మహాయోగి లక్ష్మమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బంగారు పతకాలను సాధించారు. బీఏ విద్యార్థిని వి.రూపాలావణ్య అత్యధిక మార్కులు సాధించింది. బీఎస్సీ(బీజెడ్‌సీ) చదువుతున్న ఎం. మల్లికార్జున అత్యధిక మార్కులు సాధించడంతో ఆదోనికి చెందిన లక్ష్మమ్మ సొసైటీ నిర్వాహకులు విద్యార్థులకు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే పార్థసారథి చేతుల మీదుగా అందజేశారు. ఉత్తమ మార్కులు సాధించి బంగారు పతకాలు కైవసం చేసుకున్న విద్యార్థులను ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా, సూపరింటెండెంట్ మద్దిలేటి, అధ్యాపకులు అభినందించారు.

డిప్యూటీ సీఎం దీక్షకు మద్దతు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 28: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా శనివారం జనసేన నాయకుడు భాస్కర్ దీక్షలో చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో వైసీపీ నాయకులు కల్తీ నెయ్యిని వాడి అపవిత్రం చేశారన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి తొగటతోట నరసింహులు మద్దతు తెలిపారు. కళ్యాణ్, గోరంట్లప్ప, నరసప్ప, నాయుడు, పృథ్వీ, వంశీ, శివ, రమేష్, వెంకటేష్, వెంకన్న, పవన్‌లు పాల్గొన్నారు.

కల్తీ చేసిన వారిని శిక్షించాలి

తుగ్గలి, సెప్టెంబరు 28: తిరుపతి లడ్డూను కల్తీ చేసిన వారిని శిక్షించాలని లింగాయత్ రాష్ట్ర నాయకులు బాదడ కౌశిక్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ భక్తులు లడ్డూ ప్రసాదాన్ని మహా పవిత్రంగా స్వీకరిస్తారని, అలాంటి లడ్డూనే అపవిత్రం చేసి భ్రష్టు పట్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవాలి



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న వీరభద్ర గౌడ్, రామకృష్ణ

ఆలూరు, సెప్టెంబరు 28: విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ సూచించారు. శనివారం పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, మొలగవల్లి ఉర్దూ పాఠశాలలకు ఎన్ఆర్ఐ గోరంట్ల వాసుబాబు అందజేసిన సైన్స్ పరికరాలు, ల్యాబ్‌ను ప్రారంభించారు. హెచ్ఎం సుజాత, ఎంఈవో చిరంజీవి రెడ్డి, ఎస్టీయూ నాయకులు నాగరాజు, సీపీఐ నాయకులు గిడ్డయ్య, రామాంజినేయులు, బుషేష్, టీడీపీ కన్వీనర్ అశోక్, సురేంద్ర పాల్గొన్నారు.

సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం

సొంత ఇంటి కలను సహకారం చేయడమే టీడీపీ లక్ష్యమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు.. శనివారం ఎట్టణంలోని సచివాలయంలో మన ఇల్లు మన గౌరవంపై అవగాహనను డీఈ ఆదినారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీవో అల్లా బాకాష్, టీడీపీ మండల కన్వీనర్ అశోక్ యాదవ్, నాయకులు నరసప్పా, కొమ్ము రామాంజినేయులు, సురేంద్ర, దేవేంద్ర, రాము యాదవ్, ముద్దు రంగ, గూళ్యం రామాంజినేయులు, వెంకటేష్, హనుమప్ప పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరుస్తాం



సజ్జలగుడ్డం రోడ్డు లేఅవుట్‌లో నాయకులు, అధికారులు

కోసిగి, సెప్టెంబరు 28: సొంతింటి కలను నెరవేరుస్తామని టీడీపీ కర్నూలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి అన్నారు. శనివారం సజ్జలగుడ్డం రోడ్డులోని ప్రభుత్వ లేఅవుట్‌లో మన ఇల్లు-మన గౌరవం గ్రామసభ హౌసింగ్ ఏఈ శేఖర్, ఏపీవో రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వలేదన్నారు. నిర్మాణాలను అధికారులు పరిశీలించి బ్యాంకు ఖాతా, ఆదార్, ఈకేవైసీ పూర్తి చేసి, లబ్ధిదారుల ఖతాతో ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేయాలన్నారు. కన్వీనర్ జ్ఞానేష్, మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, చిన్నతాయన్న, గాలెం వీరేష్, గణపతి. బసప్ప, ఈరేష్, పోతుల వీరారెడ్డి, బసవరాజు ఉన్నారు.

సూపర్ సిక్స్ అందించండి

మంత్రాలయం, సెప్టెంబరు 28: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అందించాలని మండల వైసీపీ అధ్యక్షుడు గురెడ్డి భీమిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర డిమాండ్ చేశారు. శనివారం ఆలయంలో పూజలు చేశారు. ఉపసర్పంచ్ పరమేష్, వీరనాగప్ప, ఎంపీటీసీ వెంకటేశ్ శెట్టి, గోరుకల్లు కృష్ణ, శివకుమార్, లింగారెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

మద్దికెర: మాజీ సీఎం వైఎస్ జగన్‌పై తిరుమల లడ్డూ కల్తి జరిగిందని నిందలు మోపడం తగదని జడ్పీటీసీ డి.మురళిధర్ రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచ్ బండారు సుహాసిని, మాజీ ఇరిగేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక మద్దమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. పి.వెంకటేశ్వరరెడ్డి, ఆకుల ఖాజావలి, కవిరెడ్డి కృష్ణ, ఎంపీటీసీ కాల్వ రామకృష్ణ, టైలర్ గోపాల్ తదితరులు ఉన్నారు.

పత్తికొండ టౌన్:

లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిన విషయంలో తప్పు చేసి ఉంటే ఎంతటి వారినైనా శిక్షించాలంటూ వైసీపీ శ్రేణులు అనానరు. శనివారం వెంకటేశ్వరస్వామి సన్నిధిలో వైసీపీ అదికార ప్రతినిధి శ్రీరంగడు, ఎంపీపీ నారాయణదాసు, వైసీపీ మండల కన్వీనర్ నాగరాజు పూజలు చేశారు. ఎంపీటీసీ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ సోమశేఖర్, జయచంద్రారెడ్డి, సర్పంచ్ కేశవరెడ్డి, దేవమ్మ పాల్గొన్నారు.

దురుద్దేశంతోనే అభాండాలు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 28: రాజకీయ దురుద్దేశంతోనే సీఎం చంద్రబాబు మాజీ సీఎం జగన్‌పై అభాండాలు వేస్తున్నారని వైసీపీ నాయకులు వై.రుద్రగౌడ్, కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, బుట్టాప్రతూల్ అన్నారు. శనివారం పట్టణంలోని వెంకటసాయి ఆలయంలో మాజీ ఎంపీ బుట్టా రేణుకా ఆదేశాల మేరకు పూజలు నిర్వహించారు. లక్ష్మీకాంతరెడ్డి, శివప్పగౌడు, విరుపాక్షిరెడ్డి, గడ్డం నారాయణరెడ్డి, నజీర్ అహ్మద్, కొమ్ము రాజు, మన్సూర్ పాల్గొన్నారు.

లడ్డూను భ్రష్టు పట్టించిన జగన్



మాట్లాడుతున్న మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, సెప్టెంబరు 28: తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని భ్రష్టు పట్టించింది మాజీ సీఎం జగన్ అని టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ఆరోపించారు. శనివారం తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వం కల్తీ నెయ్యితో లడ్డూ మాత్రమే కాకుండా ఇతర ప్రసాదాలను కూడా కల్తీ చేసి రూ.కోట్లు దండుకున్నారని ఆరోపించారు. హిందువుల మనోభావాలతో ఆడుకోవడం సరికాదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్లుగా పనిచేసిన వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, ఈవో ధర్మారెడ్డిలపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మంత్రాలయాన్ని అభివృద్ధి చేస్తాం

మంత్రాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం మంత్రాలయం పట్టణ అధ్యక్షుడు వరదరాజులు, తెర్నెకల్ రఘు, మేకల నరసింహులు, శివ ఆధ్వర్యంలో మంత్రాలయం చెందిన పలువురు రైతులు, గ్రామస్థులు రాఘవేం ద్రరెడ్డికి తమ సమస్యలను వివరించారు. సమస్యలు లేని మంత్రాలయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామ న్నారు. సీఎం చంద్రబాబు దృష్టికి మంత్రాలయం సమస్యలను చర్చించామని, మంత్రి నారా లోకేశ్, టీజీ భరత్ సహకారంతో తాగునీరు, సాగు నీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు మంత్రాలయంలో అన్న క్యాంటీన్లు వంటి కార్యక్రమాలు చేపడుతామన్నారు. అనంతరం శాలువ, పూలమాలతో ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, సోదరుడు రామకృ ష్ణారెడ్డిని సన్మానించారు. గ్రామస్థులు గోవిందు, రఘు, రాఘవేంద్ర, ఈరన్న, రైతులు పాల్గొన్నారు

కష్టపడిన వారికి గుర్తింపు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 28: టీడీపీలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందని ఇంటిగ్రేటెడ్ వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన గొల్ల హనుమంతు అన్నారు. శనివారం మాట్లాడుతూ తనను ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ఇంటిగ్రేటెడ్ వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 28: పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని కేవీకే శాస్త్రవేత్త రాఘవేంద్ర ఏడీఏ సునీత, డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం అగ్రికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు.స.హ.చట్టంపై అవగాహన కల్పించారు. ఏవోలు దేవభూషణ ఆనంద్, శివశంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి



భూమి పూజ చేస్తున్న నాయకులు

తుగ్గలి, సెప్టెంబరు 28: మండల అభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ వరలక్ష్మి అన్నారు. శనివారం తుగ్గలిలో ఆసుపత్రికి వెళ్లే రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. సమస్యలుంటే సొంత నిధులతోనైనా పరిష్కరిస్తామని అన్నారు. సర్పంచ్ రవి, వార్డు మెంబర్లు ఆకుల శ్రీనివాసులు ఉన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న దాత

వెల్దుర్తి, సెప్టెంబరు 28: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా తలసేమియా చిన్నా రుల కోసం ఏఐఎస్ఎఫ్, సీపీఐ ఆధ్వర్యంలో రక్త దానం చేశారు. తహసీల్దార్ చంద్రశేఖర వర్మ, సీహెచ్‌సీ ఆసుపత్రి సూపరిం డెంట్ బాలచంద్రారెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్ నాగభూషణం, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఏఎస్ఐ శివరామిరెడ్డి, సీపీఐ కార్యదర్శి కృష్ణ, రమణాచలం, శ్రీను పాల్గొన్నారు.

త్వరగా నిర్మించుకోవాలి

- హౌసింగ్ డీఈ కృష్ణయ్య

మంత్రాలయం, సెప్టెంబరు 28: జగనన్న కాలనీలో పెండింగ్‌లో ఉన్న గృహాలను త్వరగా నిర్మించుకోవాలని హౌసింగ్ డీఈ లాల్ కృష్ణయ్య సూచించారు. శనివారం సాయంత్రం మంత్రాలయం జగనన్న కాలనీలో ఇది మంచి ప్రభుత్వం కింద మన ఇల్లు-మన గౌరవం గ్రామ సభ నిర్వహించారు. మంత్రాలయంలో జగనన్న కాలనీలతో పాటు, గ్రామాల్లో నిర్మించుకుం టున్న బిల్లుపైన ప్రతి ఒక్కరూ ఇల్లును పూర్తి చేసుకోవాలని కోరారు. నిర్మాణానికి నిధులు లేనివారికి ప్రభుత్వం నిధులు ఇస్తుందని తెలిపారు. దీంతో లబ్దిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. వరదరాజులు, అశోక్ రెడ్డి, రాజు, మేకల నరసింహులు, రఘు, రామనరసింహ ఉన్నారు.

భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- నియోజవకర్గాల్లో నివాళులు



ఆదోని: నివాళి అర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 28: యువత భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, నాయకులు సూచించారు. భగత్ సింగ్ 117వ జయంతిని తిమ్మారెడ్డి బస్టాండ్ వద్ద నిర్వహించారు. బసాపురం గోపాల్, విజయ్, రమేష్, మోహన్, భీమేష్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: భగత్ సింగ్ ఆశయాను సాదిద్దా మని యుటీఎఫ్ నాయకురాలు నాగమణి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, డీవైఎఫ్ఐ నాయకుడు సురేష్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో భగత్ సింగ్ జయంతి నిర్వహించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి రంగన్న సీపీఐ కార్యాలయంలో పిలుపు నిచ్చారు. రాజీవ్, విజేంద్ర, సమీర్‌పాల్గొన్నారు.

పట్టణంలోని ఐటీఐ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంజు, రాజు పాల్గొన్నారు.

మంత్రాలయం: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎంఈవో మైనుద్దీన్, ప్రిన్సిపాల్ రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ నివాళి అర్పించారు. రాజు, ఆచారి, అరుణ, రాజు, వీరేష్, నవీన్, మహిళా కోకన్వీనర్ శిరీష, మహాలక్ష్మీ, మల్లిక పాల్గొన్నారు.

ఆస్పరి: పుప్పాల దొడ్డి, ములుగుందం, కైరుప్పల, బిల్లేకల్ గ్రామ పాఠశాలల్లో సర్దార్ భగత్ సింగ్‌కు నివాళి అర్పించారు. ఏఐవైఎఫ్ కార్యదర్శి రమేష్, రంగప్ప, వీరేష్, బ్రహ్మయ్య, దస్తగిరి, రఘు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: మండలంలోని కల్లుకుంటలో ఏఐఎస్ఎఫ్ నాయకుడు జాఫర్ పటేల్, ఏఐవై ఎఫ్ నాయకుడు రాజు సీపీఎం తిక్కన్న, సీపీఐ నాయకులు సర్దార్ పటేల్, తిక్కన్న, హనుమంతు,గిడ్డయ్య ,హజరత్ బాషా, రిహన్, శివరాజు పాల్గొన్నారు

హొళగుంద: స్థానిక తేరు బజార్‌లో నివాళి అర్పించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరంగ, మండల కార్యదర్శి సతీష్ కుమార్, అధ్యక్షుడు కాకి గాదిలింగ పాల్గొన్నారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మండిగిరిలో రామ నాయుడు, పట్టణ అధ్యక్షుడు వీరేష్, నాయకులు మోహన్, జమీర్, మంజు, సురేష్, భీమా, వెంకట్ దినకర్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: సీపీఐ కార్యాలయంలో ఏఐఎ స్ఎఫ్ మాజీ కార్యదర్శి రంగన్న, విజయేంద్ర, రాజీవ్, సమీ ఉల్లా, బజ్జార్, అజారుద్దీన్, శ్రీరామ్, ఖాదర్ పాల్గొన్నారు.